సాక్షి
జనగామ
ఆదివారం । 10 । ఆగస్టు । 2025



వినియోగదారుల ముంగిట్లో..
టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం.. ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటూ వినియోగదారుల ముంగిట్లో విద్యుత్ సేవలు తీసుకెళ్తుంది. - 8లో▸



పలకరిస్తే కన్నీళ్లే..
కంటికి రెప్పలా కాపాడి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో పిల్లలు ఆసరాగా ఉండకపోవడంతో వృద్ధులు మానసిక వేదనకు గురవుతున్నారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
35^0/24^0

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం సాధారణంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై, పలు ప్రాంతాల్లో చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మతసామరస్యానికి ప్రతీక



రఘునాథపల్లి: మండలంలోని గబ్బెటలో ముస్లింకు చెందిన దుదేకుల రంజాన్‌కు అదే గ్రామానికి చెందిన పేరబోయిన సమ్మక్క 15 ఏళ్లుగా రాఖీ కడుతూ అన్నాచెల్లెళ్ల బంధాన్ని పంచుకుంటుంది. సమ్మక్క శనివారం రంజాన్ ఇంటికి చేరుకొని రాఖీ కట్టి అన్నాచెల్లి అప్యాయతను పంచుకుంది. ఈ సందర్భంగా రంజాన్ మాట్లాడుతూ కులమతాలకతీతంగా ఏటా తనకు రాఖీ కడుతున్న సమ్మక్క దేవుడిచ్చిన చెల్లెలు అని పేర్కొన్నారు.

మహిళల సంక్షేమానికి పెద్దపీట

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి మహిళల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శనివారం రాఖీపౌర్ణమి సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, గ్యాస్ సబ్సిడీ, రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు తదితర పథకాలు మహిళల పేరిట అందిస్తున్నామన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్, స్కిల్స్‌పై శిక్షణ తరగతులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలోని సెంటర్ ఫర్ ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచింగ్ (సెల్ట్) ఆధ్వర్యంలో 40 రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సెల్ట్ డైరెక్టర్ డాక్టర్ ఆర్.మేఘనరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు తమ పేర్లను ఈనెల 30 వరకు నమోదు చేసుకోవాలని ఆ యూనివర్సిటీ విద్యార్థులకు రూ.200, నాన్ టీచింగ్ ఉద్యోగులకు, మహిళలకు ఇతరులకు రూ.1,500లు ఫీజు చెల్లించి ఈనెల 30 వరకు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 1 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు శిక్షణ తరగతులు నిర్వహిచనున్నట్లు మేఘనరావు తెలిపారు.

భద్రకాళి అమ్మవారికి పవిత్రోత్సవం



హన్మకొండ కల్చరల్: శ్రావణపౌర్ణమిని పురస్కరించుకుని భద్రకాళి దేవాలయంలో అమ్మవారికి శనివారం పవిత్రోత్సవం నిర్వహించారు. చివరి రోజు ఆలయ ప్రధానార్చకుడు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో ఊర్ధ్వసూత్రాల దండలను శాస్త్రోక్తంగా అమ్మవారిమూర్తి, స్నపనమూర్తులకు అలంకరించారు. పసుపు, ఎరుపు, నారింజ, నీలి, గులాబీ తదితర రంగుల ఊలు దారాలతో అలంకరించిన అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శేషు మాట్లాడుతూ పవిత్రోత్సవంతో ఆలయం, సకల జనులకు పవిత్రత చేకూరుతుందని అన్నారు. రక్షాబంధన విశిష్టతను వివరించారు. ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

రామప్పలో హర్‌ఘర్ తిరంగా వేడుకలు



వెంకటాపురం(ఎం): మండలంలోని చారిత్రక రామప్ప దేవాలయంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర పురావస్తు శాఖ అధికారులు శనివారం హర్‌ఘర్ తిరంగా సెల్ఫీ ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. దీంతో రామప్పకు వచ్చే పర్యాటకులు, భక్తులు, విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా నినాదంతో ఉన్న ఫ్లెక్సీలో నిలబడి సెల్ఫీలు తీసుకున్నారు. ఈ నెల 15న హర్ ఘర్ తిరంగా వేడుకలను కేంద్రం ప్రభుత్వం దేశవ్యాప్తంగా నిర్వహించనంది.

నులి పురుగులను నిర్మూలిద్దాం

- నులితో పిల్లల్లో రక్తహీనత అనారోగ్య సమస్యలు
- రేపటి నుంచి ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- 18న మాప్ డే



జిల్లాలో చిన్నారుల వివరాలు	సంవత్సరం	చిన్నారులు
	1 - 5	28,990
	6-19	84,898

జనగామ: కనుచూపుకు కనిపించని నులిపురుగును నిర్మూలిద్దాం. పిల్లలకు ఆరోగ్యంపై శ్రద్ధ వహిద్దాం. చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యంగా, చలాకీగా ఉన్నప్పుడే చదువులో, జీవితంలో రాణిస్తారు. తల్లిదండ్రులు ప్రత్యేక పర్యవేక్షణతో పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనత తగ్గించి, శారీరక, మానసికాభివృద్ధికి తోడ్పాటునందించాలి. నులిపురుగు పేగులో రక్తాన్ని పీల్చి పిప్పి చేస్తూ రక్తహీనతకు కారణమవుతుంది. అధికశాతం అనారోగ్య సమస్యలకు కారమవుతున్నాయి. జాతీయ నులిపురుగుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో ఈ నెల 11వ తేదీన నులి నివారణ మందుల పంపిణీకి వైద్యారోగ్య శాఖ సర్వం సిద్ధం చేసుకుంటుంది.

వ్యాప్తి ఇలా..
కలుషిత ఆహారం, ఈగలు వాలుతూ..దుమ్ముధూళి పడిన పదార్థాలు తినడం వలన వ్యాప్తి చెందుతుంది. బహిరంగ ప్రదేశాల్లో కాళ్లకు చెప్పులు లేకుండా మరుగుదొడ్లకు వెళ్లడం ద్వారా వచ్చే అవకాశం ఉంది. ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, వంట సరుకులను శుభ్రమైన నీటితో కడగకపోవడం, తినే ముందు, తిన్న తర్వాత చేతులు శుభ్రం చేసుకోకపోవడంతో కూడా వస్తుంది. వ్యక్తిగత పరిశుభ్రత లోపించడం, ఇంటి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండడం వల్ల నులిపురుగుల లార్వాలు జీర్ణకోశంలోకి ప్రవేశిస్తాయి.

రకాలు ఇవీ
నులిపురుగుల్లో బద్దె, నట్టలు, కొంకి, కొరడా, ఏలిక పాములు, దారపు, నీరుగడ్డ వంటి రకరకాల నులి పురుగుల రకాలు ఉన్నాయి. ఇవి ఎక్కువ శాతం చిన్నారుల పొట్టల్లో స్థావరం ఏర్పరచుకుంటాయి. వారి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తాయి.

లక్షణాలు ఇవే..
మలం వెళ్లే మార్గంలో దురద, అజీర్ణం, వాంతులు, విరేచనాలు, పొడి దగ్గు, నీరసం, కాలేయం పెరగడం, ఆడపిల్లల్లో తెల్లబట్ట కావడం, ఎక్కువ సార్లు మూత్ర విసర్జన, బరువు తగ్గడం, పోషకాహార లోపం, కడుపు నొప్పి, చదువులో ఏకాగ్రత లేకపోవడం, ఎదుగుదల తగ్గడం, మలంలో రక్తం పడడం, జ్వరం, తలనొప్పి, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.

మాత్రలు వాడే విధానం
మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాతనే పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేయాలి. అనారోగ్యంతో ఉన్న వారు పూర్తిగా కోలుకున్న తర్వాతనే మాత్రలు వేసుకోవాలి. ఏడాది వయస్సు ఉన్న వారికి, గర్భిణులు, బాలింతలు, కాలేయ వ్యాధిగ్రస్తులు, ఉదర సంబంధిత కేన్సర్ ఉన్న వారికి, పుట్టకతో గుండె సంబంధిత వ్యాధులు ఉన్న వారికి ఈ మాత్రలను ఇవ్వకూడదు. 1 నుంచి 2 ఏళ్ల లోపు చిన్నారులకు సగం గోలీ, 2 నుంచి 3 ఏళ్ల పిల్లలకు ఒక టాబ్లెట్‌ను పొడి చేసి నీటిలో కలిపి తాగించాలని సూచించారు. 3 నుంచి 19 సంవత్సరాల బాలురు మాత్రం గోలీని నమిలిమింగాలని చెబుతున్నారు.

నివారణ చర్యలు
భోజనానికి ముందు ఆటలు, మలవిసర్జన తర్వాత చేతులను శుభ్రం చేసుకోవాలి. పరిశుభ్రత పాటించడంతో పాటు కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తీసుకోవాలి. తీపి పదార్థాలను పిల్లలకు దూరంగా ఉంచాలి. తినే సమయంలో వేడి పదార్థాలను ఉండేలా చూసుకుంటూ, మలబద్ధకం రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలి. పీచుపదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారాన్ని ఎక్కువగా తీసుకునేలా తల్లిదండ్రులు చూడాలి.

రేపటి నుంచి
ఈ నెల 11వ తేదీ నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లో నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేయనున్నారు. 11న గోలీలు వేసుకోలేని పిల్లలకు 18వ తేదీన మాప్‌డే పురస్కరించుకుని వేయనున్నారు.

నులిపురుగుల నివారణ ఎంతో అవసరం – కలెక్టర్ రిజ్వాన్ బాషా



మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్‌బాషా

పిల్లల ఆరోగ్యవంతమైన జీవితంలో నులిపురుగుల నివారణ ఎంతో అవసరమని కలెక్టర్ రిజ్వాన్ బాషా అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో జరిగిన జిల్లా టాస్క్‌ఫోర్స్ సమావేశం (డీటీఎఫ్)లో 11న జరిగే నులిపురుగుల నివారణ దినోత్సవంపై మాట్లాడారు. 11వ తేదీన ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలతో పాటు అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు నులిపురుగుల నివారణ మందులను పంపిణీ చేయనున్నామన్నారు. ఆ రోజు వీలు కాని వారికి 18న మాప్‌డేను పురస్కరించుకుని వేస్తామన్నారు. ఇందులో మహిళా శిశు సంక్షేమ, విద్య, ఇతర శాఖలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. గోలీలు ఎలా వేయాలనే దానిపై హెల్త్ సెంటర్ స్థాయిలో వైద్య సిబ్బందికి శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతీ పిల్లవాడికి మందులు ఇచ్చేలా చూడాలన్నారు.

శిక్షణ పొందిన వారి పర్యవేక్షణలో..



శిక్షణ పొందిన వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో నులిపురుగుల నివారణ మందులను వేయనున్నాం. పిల్లల సంఖ్యకు తగ్గట్టుగా మందులు సరిపడా అందుబాటులో ఉన్నాయి. మందులు వేసే సమయంలో విద్యార్థులు అందుబాటులో ఉండాలి.

- డాక్టర్ మల్లికార్జునరావు, జిల్లా వైద్యాధికారి

‘సెల్ఫీ విత్ రాఖీ’కి అపూర్వ స్పందన



స్టేషన్‌ఘన్‌పూర్‌లో తమ్ముడు కొలిపాక ఈశ్వర్‌ప్రసాద్‌కు రాఖీ కడుతున్న అక్కలు వర్షిణి, తేజశ్రీ, దివ్యశ్రీ



జనగామ బీరప్పగడ్డలో రాఖీ కట్టిన అనంతరం సెల్ఫీ తీసుకున్న కుటుంబం

రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని ‘సాక్షి’ నిర్వహించిన ‘సెల్ఫీ విత్ రాఖీ’ శీర్షికకు పాఠకుల నుంచి విశేష స్పందన లభించింది. వివిధ ప్రాంతాల నుంచి రాఖీలు కడుతూ ఆడపడుచులు పంపించిన సెల్ఫీ ఫొటోల్లో మేలిమి కొన్నింటిని ఇక్కడ ప్రచురిస్తున్నాం. - మిగతా ఫొటోలు 9లో▸

అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ





జనగామలో రాఖీలు కడుతున్న అక్కా,చెల్లెళ్లు

- ఘనంగా రక్షాబంధన్ వేడుకలు
- ఆలయాల్లో ప్రత్యేక పూజలు



బస్సులో విధులు నిర్వర్తిస్తున్న సోదరుడి (కండక్టర్)కి రాఖీ కడుతున్న సోదరి గంధమల్ల లక్ష్మి



కన్యకాపరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో పూజలు

జనగామ: అన్నాచెల్లెల్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధానికి ప్రతీక జరుపుకునే రాఖీపౌర్ణమి వేడుకలను శనివారం జిల్లా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోదరులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని చెల్లి రాఖీ కడితే, కట్నకానుకలు ఇచ్చి సౌభాగ్యంగా ఉండాలని దీవించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన ఆడపడుచులతో ఇళ్లలో సందడి నెలకొంది. చిన్ననాటి స్నేహితులు సైతం స్నేహానికి గుర్తుగా పండుగ వేడుకలు జరుపుకున్నారు. రక్షాబంధన్ పర్వదినం పురస్కరించుకుని మిఠాయి దుకాణాలు, పూలు, వస్త్ర వ్యాపార దుకాణాల్లో వ్యాపారాలు జోరుగా సాగాయి. పట్టణంలోని బాణాపురం శ్రీ వేంకటేశ్వర, శ్రీ సంతోషిమాత, చెన్నకేశ్వర, గుండ్లగడ్డ శ్రీ ఉమామహేశ్వర, ఉప్పలమ్మ సహిత ఆంజనేయ, జ్ఞానసరస్వతీ, సాయిబాబా, పోషమ్మ, రేణుక ఎల్లమ్మ ఆలయాలకు భక్తులు పోటెత్తారు. అనంతరం అమ్మవారి పాదాల వద్ద రాఖీలతో చల్లగా దీవించు తల్లీ అంటూ వేడుకున్నారు. కాగా ఆర్టీసీ బస్సులో విధులు నిర్వర్తిస్తున్న జనగామ పట్టణానికి చెందిన సోదరుడి (కండక్టర్)కి గందమల్ల లక్ష్మి (సోదరి) బస్సులోనే రాఖీ కట్టింది.

ప్రభుత్వ కార్యాలయాలపై సోలార్ పవర్ ప్లాంట్లు

- కలెక్టర్ల వద్ద డిజైన్లు ఉంటే పంపించాలి
- వీసీలో డిప్యూటీ సీఎం భట్టి




వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ రిజ్వాన్ బాషా

జనగామ: రాష్ట్రంలో గ్రామ పంచాయతీ నుంచి ప్రతీ ప్రభుత్వ కార్యాలయంలో సోలార్ పవర్ ప్లాంటు ఏర్పాటు చేసే విధంగా సర్కారు ముందుచూపు ఆలోచన చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. శనివారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం అమలుకు సంబంధించి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సీఎండీ ముషారఫ్ ఫారుకి, రెడ్కో సీఎండీ అనిల్‌తో కలిసి డిప్యూటీ సీఎం వీసీలో జిల్లా కలెక్టర్లతో మాట్లాడారు. ఇందిరా సౌర గిరిజల వికాస పథకం అమలు ప్రక్రియలో మరింత వేగం పెంచాలన్నారు. సోలార్ విద్యుత్‌ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని యావత్ కేబినెట్ విధాన నిర్ణయం తీసుకుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా కలెక్టరేట్లన్నీ ఒకే నమూనాలో ఉండడంతో సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాద్ నుంచి పంపిస్తామని, లేదా కలెక్టర్ వద్ద ఉంటే తమకు అందించాలని కోరారు. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని, అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపించాలని కలెక్టర్‌ను ఆదేశించారు.

అరకొర సిబ్బందితో అవస్థలు

- ఒత్తిడి తట్టుకోలేక ఏఈ ఉద్యోగానికి రాజీనామా?
- ఇందిరమ్మ బిల్లుల చెల్లింపులో జాప్యం
- చెల్లించిన బిల్లులపై అధికారులకు సమాచారం కరువు



పిల్లర్ల వరకు నిర్మాణం పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

లింగాలఘణపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం జిల్లాలో నత్తనడకన సాగుతుంది. జిల్లాలో అరకొర సిబ్బందితో లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు రావడం లేదు. మంజూరైన లబ్ధిదారుల ఇళ్లను త్వరగా ప్రారంభించాలని పంచాయతీ కార్యదర్శి నుంచి ఎంపీడీఓలు, ఏఈలు, డీఈలు వెంటబడి ప్రారంభించారు. దీంతో ఇళ్లను ప్రారంభించి బేస్‌మెట్ వరకు పూర్తి చేసిన లబ్ధిదారులకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో లబ్ధిదారుల నుంచి ఒత్తిడి తీవ్రమై మండలంలో హౌసింగ్ ఏఈగా పని చేసిన దివ్య ఇటీవల ఉద్యోగానికి రాజీనామా చేశారు. లింగాలఘణపురం, రఘునాథపల్లి మండలాలకు ఏఈగా పని చేసిన ఏఈ రాజీనామా చేయడంతో జనగామ, జనగామ రూరల్ మండల ఏఈ లింగాలఘణపురానికి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. జిల్లాలో కేవలం ఐదుగురు ఏఈలు మాత్రమే ఉండగా ఏడు మండలాలకు డీఈ ఒక్కరే ఉన్నారు.

పని ఒత్తిడే కారణమా?
లింగాలఘణపురం మండల ఏఈగా పని చేస్తూ రఘునాథపల్లి ఇన్‌చార్జ్‌గా కొనసాగుతున్నారు. ఈ నేపథ్యంలో రెండు మండలాల్లో మహిళ ఉద్యోగిగా తిరగలేక పని ఒత్తిడితో రాజీనామా చేశారా లేక లబ్ధిదారులు బిల్లుల చెల్లింపుపై రోజూ ఫోన్లు చేసి ఒత్తిడి చేయడంతో అనే విషయం తెలియడంలేదు. ఈ విషయమై డీఈ చంద్రశేఖర్‌ను వివరణ కోరగా ఏఈ రాజీనామా చేసిన మాట వాస్తవమేనన్నారు. కాగా ఎవరెవరికి బిల్లులు జమ అయ్యాయనే సమాచారమే కరువైందని, పడని వారు వచ్చి అడిగితే తప్ప తెలియని పరిస్థితి నెలకొంది.

ఇరవై రోజులైంది..బిల్లు రాలె..



బేస్‌మెంట్ వరకు పని చేసి ఇరవై రోజులైంది. సార్లు వచ్చి ఫొటోలు తీసుకున్నారు. లోకల్ బ్యాంక్ అకౌంట్ వద్దంటే జనగామకు పోయి ఎస్‌బీఐ అకౌంట్ తీసి ఇచ్చా. ఇంకా బిల్లు పడలె. ఏమైందని సార్లను అడిగితే పంపించాం.. వస్తాయనే చెబుతున్నారు.. కాని రాలేదు.

- గ్యాదరి రేణుక, లింగాలఘణపురం

సిబ్బంది కొరత ఉంది..
సాధ్యమైనంత వరకు లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చేస్తున్నాం. పూర్తయిన పనిని బట్టి ఫొటోలు అప్‌లోడ్ చేస్తున్నాం. బిల్లుల చెల్లింపు సమాచారం రావడంలేదు. లబ్ధిదారులు ఆందోళన పడాల్సిన పని లేదు. సిబ్బంది కొరత ఉంది. జిల్లాలో కేవలం ఐదుగురు ఏఈలు మాత్రమే ఉన్నారు. పీడీ ఆఫీసులో ఆపరేటర్లు లేరు. ఏడు మండలాలకు ఒక్కడినే డీఈని ఉన్నా.

- చంద్రశేఖర్, డీఈ హౌసింగ్

మరో ఏడు నెలలే..!

దేవాదుల ప్రాజెక్టు పూర్తికి సర్కారు డెడ్‌లైన్

- 2026 మార్చి నాటికి పూర్తయ్యేనా.. భూసేకరణకు అడ్డంకులు
- ఇప్పటికే నాలుగు పర్యాయాలు ప్రాజెక్టుపై సమీక్ష
- 9 శాతం పెండింగ్‌తో అసంపూర్తి... రూ.17,500 కోట్లకు అంచనా...
- నేడు డిప్యూటీ సీఎం, ఉత్తమ్ సహా ఐదుగురు మంత్రుల రాక
- సమ్మక్క బ్యారేజీ పరిశీలన.. అనంతరం అధికారులతో సమీక్ష



సాక్షిప్రతినిధి, వరంగల్: జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తికి సర్కారు గడువు దగ్గర పడుతోంది. 2004లో ఈ ప్రాజెక్టు నిర్మాణం కోసం కొబ్బరికాయ కొడితే.. సుమారు 21 ఏళ్లు గడుస్తున్నా పూర్తి కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం 2023లో అధికారంలోకి వచ్చాక మొదట 2025 డిసెంబర్ నాటికి దేవాదుల సహా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటించింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి మూడు పర్యాయాలు ‘దేవాదుల’పై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ ఏడాది మార్చి, మేలో ములుగు జిల్లా కన్నాయిగూడెం, హనుమకొండ జిల్లా దేవన్నపేట వద్ద కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా 2026 మార్చి నాటికి ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు మరో ఏడు నెలలే గడువు ఉండడంతో మంత్రులు తరచూ పర్యటించి సమీక్షలు నిర్వహిస్తుండడం చర్చనీయాంశం అవుతోంది.

భూసేకరణే అసలు సమస్య..
జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు పూర్తికి మూడో దశలో పెండింగ్‌లో ఉన్న భూసేకరణే ఇప్పుడు అసలు సమస్యగా మారింది. ఈ ప్రాజెక్టు ప్రారంభంలో మొత్తం 33,224 ఎకరాల భూసేకరణ అవసరం కాగా, దశలవారీగా 30,268 ఎకరాలు చేశారు. జనగామ, పాలకుర్తి, గజ్వేల్, నర్సంపేట, వర్ధన్నపేట నియోజకవర్గాల పరిధిలో సుమారు 2,956 ఎకరాల వరకు భూ సేకరణ చిక్కుముడిగా మారింది. రోజురోజుకూ భూముల ధరల పెరుగుతున్న నేపథ్యంలో రైతులు భూములు ఇవ్వడానికి అంగీకరించకపోవడం, భూములు ఇచ్చిన కొందరు ధర గిట్టుబాటు కాలేదని కోర్టుకు వెళ్లడం లాంటి కారణాలతో ఏళ్లుగా పెండింగ్ పడుతూ వస్తోంది. 2004లో రూ.6,016 కోట్లున్న అంచనా వ్యయం 2020 జూన్ నాటికే రూ.14,729.98 కోట్లకు పెరిగింది. 2024 ఆగస్టు నాటికి రూ.17,500 కోట్లు దాటిందని అంచనా వేశారు. మొత్తంగా ఈ ప్రాజెక్టు 91 శాతం పూర్తయి, సగానికి పైగా ఆయకట్టుకు నీరందిస్తున్నా.. 9 శాతం పెండింగ్ పనులతో అసంపూర్తి ప్రాజెక్టుల ఖాతాలో చేరింది.

మంత్రుల పర్యటనకు ఏర్పాట్లు..
డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, ధనసరి అనసూయ సీతక్క, ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు ఆదివారం ములుగు జిల్లాలో పర్యటించనున్నారు. సమాచార పౌరసంబంధాల శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం.. మధ్యాహ్నం 3:45 గంటలకు ములుగు జిల్లాలోని కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం హెలిపాడ్‌కు మంత్రులు చేరుకుంటారు. 3:50 గంటలకు సమ్మక్క–సాగర్ బ్యారేజీ, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్‌కి సంబంధించిన పంపింగ్ స్టేషన్‌ను వారు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారు. అనంతరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిపై ఇంజనీర్లతో మంత్రులు సమీక్ష నిర్వహిస్తారు. 6 గంటలకు హెలికాప్టర్‌లోనే హైదరాబాద్‌కు బయలుదేరుతారు. డిప్యూటీ సీఎం, మంత్రుల పర్యటన సందర్భంగా అధికారులు, పోలీసులు భారీగా ఏర్పాట్లు చేశారు.

9 జిల్లాలకు ప్రయోజనం..
ఏడాదిలో 300 రోజులు 60 టీఎంసీల నీటిని వినియోగించుకుని 9 జిల్లాల్లో 5.57 లక్షల ఎకరాలకు నీరందించే ప్రాజెక్టు పూర్తి కావడానికి మరో 9 శాతం పనులు మిగిలి ఉన్నాయి. హనుమకొండ, వరంగల్, జయశంకర్ భూపాలపల్లి, జనగామ, ములుగు జిల్లాలతోపాటు కరీంనగర్, సిద్దిపేట, యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లోని 37 మండలాలకు చెందిన 5,56,722 ఎకరాలకు నీరందించడం ఈ పథకం లక్ష్యం. ఇప్పటి వరకు 3,16,634 ఎకరాల ఆయకట్టు సాగులోకి రాగా.. మరో 2,40,088 ఎకరాల ఆయకట్టుకు నీరందాల్సి ఉంది. అదనంగా మరో 89 వేల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. అయితే, మూడో దశలో నిలిచిపోయిన భూసేకరణ కారణంగా ఈ ప్రాజెక్టు 21 ఏళ్లయినా అసంపూర్తిగానే ఉంది. రైతులు ఎక్కువ పరిహారాన్ని డిమాండ్ చేయడం, కోర్టు కేసులు వంటివి భూసేకరణకు అడ్డంకిగా మారాయి. ఈ నేపథ్యంలో 2024 ఆగస్టు 31న కన్నాయిగూడెం బ్యారేజీ వద్ద జిల్లా మంత్రులు, కలెక్టర్లు, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమీక్ష జరిపిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమించి 2026 మార్చిలోగా ఈ పథకాన్ని పూర్తి చేస్తామని ప్రకటించారు.

పండుగ వేళ ప్రయాణికుల రద్దీ

- జాతరను తలపించిన ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాలు
- ఒక్కో బస్సులో 120 మందికి పైగానే...
- రాఖీలు కట్టేందుకు వెళ్తూ అవస్థలు



స్టేషన్‌ఘన్‌పూర్ బస్టాండ్‌లో..



జనగామ ఆర్టీసీ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ

జనగామ: రాఖీ పండుగ అక్కాచెల్లెళ్లకు చెమటలు పట్టించింది. గతంలో ఎన్నడూ లేని విధంగా ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాలు వందలాది మందితో కిక్కిరిసి పోయాయి. ప్లాట్‌ఫాంపైకి వచ్చే బస్సు ఎక్కేందుకు తోపులాడుకున్నారు. ఒక్కో బస్సులో 120 మంది ప్రయాణికులు ఒంటి కాలుపై ప్రయాణం చేస్తూ... సోదరుల వద్దకు చేరుకున్నారు. రాఖీ పండుగను పురస్కరించుకుని శనివారం జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి నెలకొంది. ఆర్టీసీ సంస్థ జనగామ, హనుమకొండ, హైదరాబాద్‌లోని పలు ప్రాంతాలకు చెందిన డిపో సర్వీసులను అదనంగా నడిపించినా.. రద్దీ కంట్రోల్ కాలేదు. దీంతో ఉప్పల్, బచ్చన్నపేట, నర్మెట, రఘునాథపల్లి, పాలకుర్తి రూట్‌లో ప్రైవేట్ వాహనాలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. జనగామ డిపో నుంచి ఒక్కరోజే 60 వేలకు పైగా ప్రయాణికులు తరలించారు. అలాగే పండుగ నేపథ్యంలో పట్టణంలో హెవీ ట్రాఫిక్ పెరిగింది. సిద్దిపేట రోడ్డు, స్వర్ణకళామందిర్, రైల్వే స్టేషన్, నెహ్రూపార్క్ రూట్లలో జనంతో పాటు వాహనాలు నిండిపోవడంతో ముందుకు కదలలేని పరిస్థితి ఎదురైయింది. స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఎక్స్‌ప్రెస్ బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు.

క్లుప్తంగా

అన్న విగ్రహానికి రాఖీ కట్టిన చెల్లెలు


అన్న విగ్రహానికి రాఖీ కడుతున్న లింగమ్మ

నెల్లికుదురు: అన్నపై మమకారం చంపుకోలేక ఓ చెల్లెలు అన్న విగ్రహానికి రాఖీ కట్టి తన అభిమానం చాటుకుంది. ఈ సంఘటన మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలం చిన్న నాగారంలో శనివారం చోటు చేసుకుంది. చిన్న నాగారం గ్రామ మాజీ ఎంపీటీసీ గుగులోత్ లక్ష్మణ్ రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. గ్రామంలో లక్ష్మణ్ విగ్రహాన్ని కుటుంబ సభ్యులు ఏర్పాటు చేశారు. ఆయన చెల్లెలు బానోత్ లింగమ్మ రాఖీ పండుగరోజు విగ్రహానికి రాఖీ కట్టి అన్నా చెల్లెలు అనుబంధాన్ని చాటిచెప్పింది.

కమిటీ పేరిట వసూళ్లు..

● తొమ్మిది మందిపై కేసు

న్యూశాయంపేట: వరంగల్ మూడో డివిజన్ పైడిపల్లి పరిధి ఆర్టీసీ కాలనీలో డెవలప్‌మెంట్ కమిటీ పేరుతో కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్న వారిని భయభ్రాంతులకు గురిచేస్తూ డబ్బులు వసూలు చేస్తున్న తొమ్మిది మంది వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ జవ్వాజి సురేశ్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఫిర్యాదుదారు మిట్టపల్లి స్వప్న ఆర్టీసీ కాలనీలో 2005లో ఆర్టీసీ సొసైటీలో ఉన్న తన మామ మిట్టపల్లి ఉప్పలయ్య దగ్గర 140 గజాల భూమి కొనుగోలు చేసింది. ఆ భూమిలో ప్రహరీ నిర్మాణం చేపడుతున్న క్రమంలో కాలనీకి చెందిన తొమ్మిది మంది వ్యక్తులు ఇక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టొద్దని నిర్మాణాన్ని కూలగొట్టారు. భూమి మీది కాదని బెదిరించారు. ప్రహరీ నిర్మిస్తే కాలనీ డెవలప్‌మెంట్ కమిటీకి రూ. రెండు లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో భూమిలో అడుగు పెట్టనీయమని, వెళ్తే చంపేస్తామని బెదిరించారు. ఈ ఘటనపై స్వప్న భర్త ఫిర్యాదు మేరకు ఆ తొమ్మిది మందిపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సురేశ్ తెలిపారు.

విధులకు ఆటంకం కల్పించిన వ్యక్తిపై కేసు

స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని ఇప్పగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యురాలు సాయిప్రణిత, వైద్య సిబ్బంది విధులకు ఆటంకం కల్పిస్తూ దుర్భాషలాడిన పసునూరి తిరుపతిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ జి.వేణు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. రోజు మాదిరిగానే సాయిప్రణిత ఈ నెల 7న ఇప్పగూడెం ఆస్పత్రిలో ఉదయం 11 గంటల సమయంలో విధులు నిర్వహిస్తుండగా అదే గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి రాగా ఓపీ చూసి మందులు రాసి ఫార్మసీలో తీసుకోవాలని చెప్పింది. ఫార్మసిస్టు ప్రఫుల్ల వద్దకు వెళ్లి మందులు అడుగుతూ మీరు ఏ టైంకు ఆస్పత్రికి వస్తున్నారు, ఏ టైంకు వెళ్తున్నారు.. అంటూ దుర్భాషలాడారు. వెంటనే వైద్యురాలు, ల్యాబ్ టెక్నీషియన్ ఎందుకు అలా మాట్లాడుతున్నారని అడిగితే మాపై కూడా దుర్భాషలాడారని, సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీస్తున్నట్లుగా బెదిరిస్తూ మా విధులకు ఆటంకం కల్పించారని ఫిర్యాదులో పేర్కొంది. వైద్యురాలి ఫిర్యాదు మేరకు తిరుపతిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వినియోగదారుల ముంగిట్లో సేవలు..

● విద్యుత్ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం
● మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం..
● టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో పలు కార్యక్రమాలు



హన్మకొండ: టీజీ ఎన్పీడీసీఎల్ యాజమాన్యం.. ఆధునిక సాంకేతికను అందిపుచ్చుకుంటూ వినియోగదారుల ముంగిట్లోకే విద్యుత్ సేవలు తీసుకెళ్తుంది. ఫలితంగా మునుపెన్నడూ లేని విధంగా మెరుగైన, నాణ్యమైన సేవలు వినియోగదారులకు చేరువ అవుతున్నాయి. సంస్థ సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి వినియోగదారుల సమస్యలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ ప్రతీ సమాచారం చేరుకునేలా డ్యాష్ బోర్డు రూపకల్పన చేశారు. అలాగే, టోల్ ఫ్రీ నంబర్ 1912 ద్వారా ఫిర్యాదులు చేసుకునే సౌకర్యం అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో సంస్థ చేపడుతున్న పలు కార్యక్రమాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

విద్యుత్ ప్రజావాణి..

వినియోగదారుల సమస్యల పరిష్కారానికి టీజీ ఎన్పీడీసీఎల్ ప్రత్యేకంగా విద్యుత్ ప్రజావాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసింది. ఇందులో ప్రతీ సోమవారం ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సెక్షన్, డివిజన్ కార్యాలయాల్లో, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 వరకు సర్కిల్ కార్యాలయంలో విద్యుత్ వినియోగదారుల నుంచి వినతులు, దరఖాస్తులు స్వీకరిస్తారు. ఫిర్యాదుల సమస్య తీవ్రతను బట్టి అప్పటికప్పుడే లేదా సమయం తీసుకొని పరిష్కరిస్తున్నారు.

ఎమర్జెన్సీ రిస్టోర్ టీమ్..

వినియోగదారులకు విద్యుత్ అంతరాయాలు తగ్గించడానికి, యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ చర్యలు చెప్పట్టడానికి ఎమర్జెన్సీ రీస్టోర్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, సాంకేతికంగా విద్యుత్ సమస్యలతో ఏర్పడే అంతరాయాలు తగ్గించడానికి, బ్రేక్ డౌన్ టీమ్‌లు ఏర్పాటు చేశారు. ఈఆర్‌టీ వాహనాల ద్వారా జీపీఆర్‌ఎస్ లొకేషన్ ఆధారంగా వేగంగా వెళ్లి పరిష్కరిస్తారు.

> **రైతులకు తెలుగులో సమాచారం**
>
> నూతన విద్యుత్ సర్వీస్ కోసం దరఖాస్తు చేసిన రైతులకు మంజూరుకు సంబంధించిన సమాచారం తెలుగులో అందిస్తున్నారు. ఎస్టిమేట్‌కు సంబంధించిన మెటీరియల్ తాలూకు వివరాలు, స్కెచ్ (నక్ష) వంటివి తెలుగులో అందిస్తున్నారు. రైతులకు ఎస్టిమేట్ కాపీలు తెలుగులో అందించడం ద్వారా సులభంగా అర్థమవుతాయి. ఈ వివరాలు రైతుల సెల్ ఫోన్‌కు ఎస్ఎంఎస్ రూపేణ అందుతాయి.

పొలం బాట..

టీజీ ఎన్పీడీసీఎల్ రైతుల సమస్యల పరిష్కారానికి విద్యుత్ అధికారుల పొలంబాట కార్యక్రమాన్ని రూపొందించింది. ఈ కార్యక్రమం ద్వారా ఎస్ఈ, డీఈ స్థాయి అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులను నేరుగా కలుసుకుని వారి సమస్యలు పరిష్కరిస్తున్నారు.

హెచ్‌టీ వినియోగదారులకు సింగిల్ విండో వ్యవస్థ..

హెచ్‌టీ వినియోగదారులకు విద్యుత్ సర్వీస్‌ల మంజూరును సరళీకృతం చేస్తూ ఎన్పీడీసీఎల్‌లో సింగిల్ విండో వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. హెచ్‌టీ 11 కేవీ, 33 కేవీ ఓల్టేజీ సర్వీస్‌ల మంజూరును సింగిల్ విండో ద్వారా చేస్తున్నారు. సర్కిల్ కార్యాలయంలో ఏడీఈ కమర్షియల్ 11 కేవీ దరఖాస్తులను మానిటర్ చేస్తుండగా, ప్రధాన కార్యాలయంలోని ఏడీఈ 33 కేవీ, ఆపై ఓల్టేజీ దరఖాస్తులను మానిటర్ చేస్తారు.

కన్జ్యూమర్ గ్రీవెన్స్..

సెల్‌ఫోన్‌లో టీజీ ఎన్పీడీసీఎల్ యాప్ ఓపెన్ చేసి అందులోని కన్జ్యూమర్ గ్రీవెన్స్ ఆప్షన్‌పై టచ్ చేయగానే న్యూ కాంప్లైంట్, కాంప్లైంట్ స్టేటస్, రీఓపెన్ కాంప్లైంట్, క్యాన్సల్ అనే ఫీచర్స్ కనిపిస్తాయి.

- న్యూ కంప్లైంట్: వినియోగదారుడికి సంబంధించిన సమస్యలను నేరుగా ఇందులో పొందుపరచొచ్చు. వారి మీటర్ నంబర్, సమస్య తాలూకు వివరాలు ఇందులో న మోదు చేస్తే ఆ సమస్యను పరిష్కరిస్తారు. విద్యుత్‌కు సంబంధించిన ప్రతీ అంశం పై ఫిర్యాదు చేసుకునే సౌకర్యం ఇందులో ఉంది.
- కంప్లైంట్ స్టేటస్: ఫిర్యాదు చేసిన సమస్య స్టేటస్‌ను ఇందులో చూసుకునే సౌలభ్యం ఉంది. తద్వారా కార్యాలయం వెళ్లాల్సిన అవసరం లేకుండా ఇంటి వద్ద నుంచే చూసుకునే అవకాశముంది.
- రీ-ఓపెన్ కంప్లైంట్: ఫిర్యాదు చేసిన సమస్యకు జరిగిన పరిష్కారంపై సంతృప్తి చెందక పోతే పునరావృతం చేసుకునే వీలుంది.

అసెట్ మ్యాపింగ్..

అసెట్ మ్యాపింగ్‌లో భాగంగా అన్ని 33 కేవీ, 11 కేవీ విద్యుత్ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్ పెయింటింగ్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ పోల్ నంబర్ ద్వారా అక్కడి లొకేషన్ మ్యాపింగ్ తెలుసుకుని వెంటనే చేరుకుని వేగంగా సమస్యను పరిష్కరించే అవకాశముంది. తద్వారా అంతరాయాల సమయాన్ని గణనీయంగా తగ్గించొచ్చు.

రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్..

టీజీ ఎన్పీడీసీఎల్ యాప్‌లోని రిపోర్ట్ ఆన్ ఇన్సిడెంట్ ఫీచర్ ఓపెన్ చేసి ఎక్కడైనా, ఎలాంటి ఘటన జరిగిన ఇందులో జీపీఎస్ లొకేషన్ ద్వారా వినియోగదారుడు ఫొటో తీసి పంపొచ్చు. తద్వారా రిపోర్ట్ నేరుగా సంబంధిత అధికారికి వెళ్తుంది. వెంటనే ఆ అధికారి స్పందించి ఆ సమస్యను పరిష్కరిస్తారు.

వేర్వేరు కారణాలతో నలుగురి బలవన్మరణం

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురు బలవన్మరణాలకు పాల్పడ్డారు. అప్పు చెల్లించాలని బంధువులు ఒత్తిడి చేయడంతో జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం మేకలగట్టులో వ్యక్తి, వివాహం కావడం లేదని వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పానీష్ తండాలో యువకుడు, మద్యానికి డబ్బులు ఇవ్వడం లేదని మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సీతానగరంలో వ్యక్తి, ఆర్థిక కారణాలతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండల కేంద్రానికి చెందిన తాపీమేస్త్రీ ఆత్మహత్యకు పాల్పడ్డారు. దీంతో ఆయా కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది.


ఎల్లయ్య (ఫైల్)

రఘునాథపల్లి: అప్పు చెల్లించాలని బంధువుల ఒత్తిడితో మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని మేకలగట్టులో శనివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. మేకలగట్టు గ్రామానికి చెందిన ముక్క ఎల్లయ్య (52)–రేణుకకు ఇద్దకు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. ఆరు నెలల క్రితం పెద్ద కూతురు వివాహం చేశారు. వివాహ సమయంలో ఫతేషాపూర్ గ్రామంలోని బంధువు గడ్డం మహేందర్ వద్ద రూ.2 లక్షలు అప్పు తీసుకున్నారు. మహేందర్.. ఎల్లయ్య కుమార్తె వివాహానికి వచ్చి తిరిగి వెళ్తుండగా రోడ్డు ప్రమాదంలో మరణించాడు. బిడ్డ పెళ్లికి రావడంతోనే మహేందర్ మరణించాడని, ఇచ్చిన డబ్బులు ఇవ్వాలని మేకలగట్టుకు చేరుకొని ఎల్లయ్యపై బంధువులు తీవ్ర ఒత్తిడి చేశారు. దీంతో మనస్తాపం చెందిన ఎల్లయ్య శుక్రవారం రాత్రి కిచెన్‌షెడ్‌లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు శనివారం ఉదయం లేచి చూడగా చనిపోయి కనిపించాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దూదిమెట్ల నరేశ్ తెలిపారు.

వివాహం కావడం లేదని పానీష్‌తండాలో యువకుడు..



మోహన్ (ఫైల్)

రాయపర్తి: తనకు వివాహం కావడం లేదనే మనస్తాపంతో ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన శనివారం వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పానీష్‌తండాలో చోటు చేసుకుంది. ఎస్సై రాజేందర్ కథనం ప్రకారం.. తండాకు చెందిన కొర్ర బీమా, నాజీ దంపతుల పెద్ద కుమారుడు మోహన్(25) కొంతకాలంగా తనకు వివాహం కావడం లేదని మనస్తాపం చెందుతున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 8న పురుగుల మందు తాగి ఆత్మహత్యకుయత్నించాడు. గమనించిన కుటుంబీకులు ఎంజీఎం తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి భీమా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యానికి డబ్బులు ఇవ్వలేదని సీతానగరంలో వ్యక్తి..

గూడూరు: మద్యానికి డబ్బులు ఇవ్వలేదని ఓ వ్యక్తి వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం మండలంలోని సీతానగరం శివారు ఆకులబండతండా సమీపంలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. సీతానగరం గ్రామానికి చెందిన తాటి రాకేశ్ (45), రజిత దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. వారికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. ఈ క్రమంలో రాకేశ్ కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. నిత్యం భార్యను మద్యానికి డబ్బులు అడగుతూ ఇబ్బందులకు గురిచేస్తుంటాడు. రెండు రోజుల క్రితం డబ్బులు ఇవ్వనందుకు ఇంటి నుంచి కోపంతో వెళ్లాడు. ఈ క్రమంలోనే బావిలో దూకి ఉంటాడనే భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.

ఆర్థిక కారణాలతో మొగుళ్లపల్లిలో తాపీమేస్త్రీ..


కొమురయ్య (ఫైల్)

మొగుళ్లపల్లి: ఆర్థిక కారణాలతో ఓ తాపీమేస్త్రీ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బండారి కొమురయ్య(54) తాపీమేస్త్రీగా పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ఆర్థికపరంగా గొడవ జరగడంతో డబ్బులు తీసుకొస్తానని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. శనివారం మొగుళ్లపల్లి శివారులో గొర్రెలు మేపుతున్న కాపరికి చెట్ల పొదల్లో కొమురయ్య మృతి చెంది కనిపించాడు. దీంతో గొర్రెల కాపరి పోలీసులు, కుటుంబీకులకు సమాచారం అందించాడు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిట్యాల సివిల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు అజయ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అశోక్ తెలిపారు.

అమరుల స్ఫూర్తితో పోరాడాలి

● గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు దామోదర్, చిరంజీవి
● ఘనంగా ఆదివాసీ దినోత్సవం


నృత్యాలతో ర్యాలీగా వస్తున్న గిరిజనులు

ఏటూరునాగారం: అమరుల స్ఫూర్తితో పోరాడాలని గిరిజన సంఘం రాష్ట్ర నాయకులు దామోదర్, చిరంజీవి అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలోని వై జంక్షన్ నుంచి ఐటీడీఏ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా గిరిజన తెగ ఉనికి ప్రమాదంలో పడుతోందన్నారు. ఈ తరుణంలో గిరిజన హక్కులను కాపాడుకునేందుకు ప్రభుత్వాలు, గిరిజన హక్కుల సంఘాలు చర్యలు తీసుకోవాలన్నారు. తెలంగాణలో రాష్ట్ర ప్రభుత్వం ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మాత్రం నిర్వహించడం లేదని తెలిపారు. రాజ్యాంగంలోని గిరిజన హక్కులను కాపాడుకుందామని, అడవులు, భూముల నుంచి గిరిజనులను గెంటివేయడాన్ని ఆపాలన్నారు. గిరిజనులకు ఇచ్చిన హామీల అమలు కోసం పోరాడుదాం అనే నినాదాలతో ప్రపంచ ఆదివాసీ గిరిజన హక్కుల దినోత్సవాన్ని జరుపుతున్నట్లు తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గిరిజనులకు ఇచ్చిన 16 వాగ్దానాలను వెంటనే అమలు చేసేందుకు కార్యాచరణ ప్రకటించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు పూనెం నగేశ్, కుర్సం చిరంజీవి, కుర్సం శాంతకుమారి, తోలెం కృష్ణయ్య, సోలం వీరబాబు, ఆలెం అశోక్, కోరం చిరంజీవి, కుర్సం ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యం వికటించి వ్యక్తి మృతి..

● గోపాల్‌నగర్‌లో ఘటన
● ఆర్‌ఎంపీ కారణమని కుటుంబీకుల ఆరోపణ


భిక్షపతి (ఫైల్)

బచ్చన్నపేట: ఆర్‌ఎంపీ వైద్యం వికటించి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన శనివారం మండలంలోని గోపాల్‌నగర్‌లో చోటు చేసుకుంది. బాధిత కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన గంగరబోయిన భిక్షపతి (45) ఒళ్లు నొప్పులతో స్థానిక ఆర్‌ఎంపీ కృష్ణ వద్దకు వెళ్లగా ఆయన ఇంజక్షన్ చేసి మందులు రాసి ఇచ్చాడు. ఇంటికెళ్లిన భిక్షపతి పడిపోవడంతో కుటుంబ సభ్యులు జనగామలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు.. ఆర్‌ఎంపీ ఇంటిఎదుట ఆందోళన చేపట్టారు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్సై హమీద్ ఘటనాస్థలికి చేరుకుని ఆర్‌ఎంపీ, మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడి నచ్చజెప్పారు.

రాఖీ కట్టొస్తూ.. మృత్యుఒడికి

● బైక్ అదుపు తప్పి అంగన్‌వాడీ టీచర్ మృతి
● నాంపల్లి సమీపంలో ఘటన


పద్మ (ఫైల్)

ఎస్ఎస్‌తాడ్వాయి : రాఖీ కట్టొస్తూ ఓ అంగన్‌వాడీ టీచర్ మృత్యుఒడి కి చేరింది. బైక్ అదుపు తప్పిన ఘటనలో మృతి చెందింది. ఈ ఘట న శనివారం గంగారం జీపీ పరిధిలోని నాంపల్లి సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం ప్రకారం.. ఎస్ఎస్‌తాడ్వాయి మండలం కొడిశాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్ మొగిలిపల్లి పద్మ(42), భర్త కృష్ణయ్య బైక్‌పై మండలంలోని అంకంపల్లిలో సోదరులకు రాఖీ కట్టేందుకు వెళ్లారు. రాఖీ కట్టి తిరిగొస్తుండగా గంగారం జీపీ పరిధిలోని నాంపల్లి సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వచ్చే కారును తప్పించి రోడ్డు దిగారు. మళ్లీ రోడ్డెక్కుతున్న క్రమంలో బైక్ అదుపు తప్పి కింద పడ్డారు. ఈ ఘటనలో పద్మకు తీవ్రంగా, కృష్ణయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. పద్మను 108లో తాడ్వాయి పీహెచ్‌సీకి తీసుకొచ్చే క్రమంలో మృతి చెందింది. రాఖీ కట్టి ఆనందంగా తిరిగొస్తున్న క్రమంలో పద్మ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగింది. కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్ రెడ్డి తెలిపారు.

పండుగకు ఇంటికెళ్తూ ఆరెపల్లి వద్ద యువతి..

న్యూశాయంపేట : రాఖీ పండుగకు తమ్ముడితో కలిసి ఇంటికెళ్తున్న క్రమంలో బైక్ డివైడర్‌ను ఢీకొన్న ప్రమాదంలో ఓ యువతి చెందింది. ఈ ఘటన ఆరెపల్లి వద్ద చోటు చేసుకుంది. ఏనుమాముల సీఐ జవ్వాజి సురేశ్ కథనం ప్రకారం.. ములుగు జిల్లా ములుగు మండలం మంచినీళ్ల పల్లె గ్రామానికి చెందిన రాయనబోయిన శ్యామల(23) ములుగు రోడ్డులోని గార్డియన్ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్‌గా పనిచేస్తోంది. రాఖీ సందర్భంగా శుక్రవారం రాత్రి తన తమ్ముడు శ్రీనుతో కలిసి బైక్‌పై తన గ్రామానికి వెళ్తోంది. ఈ క్రమంలో ఆరెపల్లి సమీపంలో ఎస్సారెస్పీ కెనాల్ దాటిన తర్వాత బైక్ డీవైడర్‌ను ఢీకొంది. ఈ ఘటనలో వెనుక కూర్చున్న శ్యామల అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనపై మృతురాలి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

'ఇంటర్ సిటీ'లో సాంకేతిక లోపం

● రెండు గంటలపాటు నిలిచిన రైలు

కేసముద్రం: సాంకేతిక లోపంతో ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు శనివారం రాత్రి మహబూబాబాద్ జిల్లా కేసముద్రం రైల్వే స్టేషన్ సమీపంలో రెండు గంటలపాటు నిలిచింది. దీంతో ఆప్‌లైన్‌లో వెళ్లే వందే భారత్ ఎక్స్‌ప్రెస్ కూడా గంటపాటు నిలిచింది. గుంటూరు నుంచి సికింద్రాబాద్ వైపునకు ఆప్‌లైన్‌లో వెళ్లే ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు సాంకేతిక లోపంతో కేసముద్రం, ఇంటికన్నె రైల్వే స్టేషన్ల మధ్య రాత్రి 8.10 గంటలకు నిలిచింది. దీంతో రైల్వే సిబ్బంది సమస్యను గుర్తించి మరమ్మతులు చేశారు. చివరకు రాత్రి 9.45 గంటల సమయంలో రైలు బయలు దేరింది. ఇదిలా ఉండగా ఇంటర్‌సిటీ వెనుక, ఆప్‌లైన్‌లో వెళ్లాల్సిన వందేభారత్ ఎక్స్‌ప్రెస్ కేసముద్రం రైల్వేస్టేషన్ సమీపంలో గంటపాటు నిలిచింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివచ్చింది. అంతే కాకుండా ఆప్‌లైన్‌లో వెళ్లే రెండు గూడ్స్ రైళ్లు కేసముద్రం రైల్వే స్టేషన్‌లో నిలిచాయి. కాగా, ఇంటర్ సిటీ రైలు రెండు గంటలు, వందేభారత్ సుమారు గంటపాటు నిలిచింది.


నెక్కొండ: నిలిచిన రైలు బోగీలో చీర ఊయల కట్టి చిన్నారిని ఊపుతున్న ప్రయాణికులు

నెక్కొండలో గంటకు పైగా..

నెక్కొండ: సాంకేతిక లోపంతో గుంటూరు– సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్ శనివారం రాత్రి నెక్కొండ రైల్వే స్టేషన్‌లో గంటకు పైగా నిలిచింది. రాత్రి 9.50 గంటలకు నెక్కొండకు చేరుకున్న రైలు 11.30 వరకు గంటకుపైగా నిలిచింది. ఈ విషయమై అధికారులను అడుగగా ఎస్–6 బోగిలో బ్రేక్ ఎయిర్ లీక్ కావడంతో రైలు నిలిచిందని తెలిపారు.

బాలికపై సామూహిక లైంగిక దాడి?

● ఆలస్యంగా ఘటన వెలుగులోకి..
● విచారణ ప్రారంభించిన పోలీసులు!

జనగామ: జనగామ జిల్లాలో ఓ బాలికపై పలువురు లైంగిక దాడి చేసినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లాకు చెందిన బాలికకు మాయమాటలు చెప్పి గోవాకు తీసుకెళ్లిన యువకులు.. అక్కడి నుంచి తిరిగి వచ్చిన తర్వాత ఓ గదిలో ఉంచి సామూహిక లైంగిక దాడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే జిల్లా కేంద్రంలో కొద్దిరోజుల క్రితం ఆ యువకుల మధ్య గొడవ కూడా జరగగా ఈ ఘటన సోషల్ మీడియాలో కూడా వైరల్ అయినట్లు తెలుస్తోంది. దీనిని అడ్డు పెట్టుకుని కొంతమంది వ్యక్తులు.. బాధితురాలి పేరు చెప్పుకుంటూ బెదిరింపులకు పాల్పడి డబ్బులు డిమాండ్ చేస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. బాలిక పక్షాన పోలీసులు విచారణ చేస్తున్నట్లు సమాచారం. కాగా, సంఘటనను పోలీసులు నిర్ధారించాల్సి ఉంది. సదరు యువకులపై పోక్సో కేసు నమోదైనట్లు తెలిసింది.

పలకరిస్తే కన్నీళ్లే!

● మానసిక వేదనలో వయోవృద్ధులు
● అనారోగ్యం పాలైతే కుమార్తెలే దిక్కు
● ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తే సత్వర న్యాయం


వెలుగందుల వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు

ఖిలా వరంగల్: కంటికి రెప్పలా కాపాడి పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులకు వృద్ధాప్యంలో ఆసరాగా నిలవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిది. వారి సంరక్షణకు ప్రభుత్వం సైతం పకడ్బందీ చట్టాలు తీసుకొచ్చింది. ఇదివరకు ఉమ్మడి కుటుంబాల్లో వృద్ధులు హాయిగా శేష జీవితం గడిపేవారు. ఇప్పుడాపరిస్థితి లేకపోవడంతో వృద్ధులు మానసిక వేదనకు గురవుతున్నారు. తోడును కోల్పోయి కొందరు, వృద్ధాశ్రమాల్లో మరికొందరు.. ఆదరణ లేక మరికొందరు వృద్ధులు మనోవ్యథ చెందుతున్నారు. ఇటీవల ఉమ్మడి వరంగల్ జిల్లాలో జరిగిన ఘటనల నేపథ్యంలో వృద్ధుల హక్కులపై, వారికి ప్రభుత్వం కల్పించే పథకాలపై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఫిర్యాదుతో పరిష్కారం..

వృద్ధుల కోసం ప్రభుత్వం పోషణ, సంరక్షణ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. వృద్ధుల సంక్షేమ బాధ్యతలను జిల్లా వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమశాఖకు అప్పగించింది. ఈచట్టం ప్రకారం తల్లిదండ్రులను పట్టించుకోని వారికి మూడు నెలల జైలు శిక్ష, రూ.5 వేలు జరిమానా లేదా రెండూ విధించే అధికారం సంబంధిత ఆర్డీఓకు అప్పగించింది. ఆస్తులు పంచుకున్నాక వృద్ధులను పట్టించుకోకుండా ముఖం చాటేస్తే ఆర్డీఓ ఫిర్యాదు చేయగానే కుటుంబ సభ్యులను పిలిపించి కౌన్సెలింగ్ జరిపి నెల రోజుల వ్యవధిలో బాధితులకు భరణం అందేలా చర్యలు చేపడతారు. ఆస్తి వివాదాలుంటే పరిష్కారిస్తారు.

చట్టాలు ఇలా..

2007లో అమల్లోకి వచ్చిన పేరెంట్స్ యాక్ట్‌ను అతిక్రమిస్తే జరిమానాతోపాటు ఏడేళ్ల జైలు శిక్ష పడే అవకాశం. ఐపీసీ 125 ప్రకారం భార్యపై భర్త బాధ్యతారహితంగా వ్యవహరిస్తే భరణం కేసు వేయొచ్చు. అదేవిధంగా కొడుకులు, కూతుళ్లు తల్లిదండ్రులపై బాధ్యతారహితంగా వ్యవహరిస్తే కొడుకుల నుంచి తల్లిదండ్రులు భరణం తీసుకోవచ్చని చట్టం చెబుతోంది.

ప్రభుత్వం ఇచ్చే పథకాలు..

రైల్వే ప్రయాణంలో సీనియర్ సిటిజన్లకు రాయితీ ఉంది. ఆర్టీసీ బస్సుల్లో ప్రత్యేకంగా రెండు సీట్ల కేటాయిస్తున్నారు. ఆసరా పథకం కింద పెన్షన్ అందిస్తోంది. బ్యాంకుల్లో ఐదేళ్ల పొదుపు పథకం ద్వారా అదనపు వడ్డీ అందజేస్తున్నాయి. దైవదర్శనాల్లో ప్రత్యేక క్యూలైన్, సౌకర్యాలు కల్పిస్తున్నాయి.

> జనగామ జిల్లా చిల్పూరు మండలం పల్లగుట్ట గ్రామానికి చెందిన మాధవరెడ్డి, జయమ్మ (79) దంపతులకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. వీరి వివాహం కాగానే కొడుకు ఆస్తులు విక్రయించి తల్లిదండ్రులను గాలికొదిలేసి హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. అక్కడి నుంచి కెనడాలో ఉంటున్న కొడుకు వద్దకు వెళ్లిపోయారు. వారి ఆలనాపాలన చూసే వారు లేక అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తల్లిదండ్రులను వరంగల్ ఎస్ఆర్ఆర్‌తోటకు చెందిన కుమార్తె ఆవృద్ధులను ఇంటికి తీసుకొచ్చి బాగా చూసుకున్నప్పటికీ జూలై 16న అనారోగ్యంతో తల్లి మృతి చెందింది. కన్న తల్లి జయమ్మ మృతి విషయం తెలియజేసినప్పటికీ కొడుకు కెనడా నుంచి రాలేదు. కుమార్తెలే తల్లికి తలకొరివి పెట్టి దహన సంస్కారాలు నిర్వహించారు. ప్రస్తుతం కుమార్తె వద్ద తండ్రి ఉంటున్నాడు. ఆమె తండ్రి ఆలనపాలనతోపాటు సంరక్షణ బాధ్యతలను నిర్వర్తిస్తోంది.

> వరంగల్ చెందిన ఓ ఉద్యోగికి ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులు. కుమార్తెల పెళ్లి అయి అత్తారింటికి వెళ్లడం.. కొడుకులు ఉద్యోగరీత్య దూరంగా ఉండిపోవడంతో ఉద్యోగ విరమణ తర్వాత ఆప్యాయత పలకరింపు కరువయ్యాయి. అనారోగ్యానికి గురై భార్య మృతి చెందగా.. ఒంటరైన తండ్రిని పలకరించడానికి కొడుకులు రాలేదు. ఇంటిని వదిలేసి వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్నాడు. ఇక్కడే ప్రశాంతంగా ఉందని ఆయన చెబుతున్నాడు.